

జ్యోతి వెలిగిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రి, ఎమ్మెల్యేలు

బందరు, బెజవాడకు పర్యాటక వరాలు

పర్యాటక దినోత్సవంలో సీఎం చంద్రబాబు

ప్రకాశం బ్యారేజీ ఎగువన త్వరలో సీ ప్లేన్

- శ్రీశైలం, ఇతర పర్యాటక ప్రాంతాలకు వెళ్లేందుకే..
- మంగినపూడి బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్ కోసం ప్రయత్నాలు
- మచిలీపట్నానికి త్వరలో ప్రపంచస్థాయి పర్యాటకులు
- హంసలదీవి, ఇతర పర్యాటక ప్రాంతాలకూ ఆదరణ

ప్రపంచ పర్యాటక దినోత్సవం రోజున ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యాటక వరాలు కురిపించారు. తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శుక్రవారం రాత్రి జరిగిన పర్యాటక దినోత్సవంలో ఆయన విజయవాడ, మచిలీపట్నం గురించి ప్రత్యేకంగా మాట్లాడారు. ఇక్కడి పర్యాటకాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను తెలియజేశారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కృష్ణానదిలో సీ ప్లేన్ ప్రాజెక్టును త్వరలో ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రపంచ పర్యాటక దినోత్సవంలో భాగంగా శుక్రవారం రాత్రి తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రకాశం బ్యారేజీ ఎగువన నదిలో సీ ప్లేన్ ప్రాజెక్టును ప్రారంభిస్తామని, ఇందుకు సంబంధించిన కసరత్తు జరుగుతోందని, ఇక్కడి నుంచి శ్రీశైలం తదితర ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలకు వెళ్లేలా ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఇక మచిలీపట్నం బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేశామన్నారు. ఈ సర్టిఫికెట్ వస్తే మచిలీపట్నం బీచ్‌కు గ్లోబల్ గుర్తింపు వస్తుందని సీఎం పేర్కొన్నారు.

విజయవాడ వరదలపై ఆవేదన

విజయవాడలో వరదల గురించి సీఎం తన మనసులోని ఆవేదనను తెలిపారు. విజయవాడలో వరదలు వచ్చినపుడు మూడు రోజుల పాటు మంచినీరు కూడా ఇవ్వలేకపోవడం బాధ కలిగించిందన్నారు. పది రోజులు నేను బురదలో తిరిగాను. మా ఆఫీసర్లు, ఎమ్మెల్యేలు, మంత్రులు అందరూ తిరిగి సాధారణ స్థితికి తీసుకురావటానికి ప్రయత్నించారు. మా చర్యలను చూసిన తర్వాత రాష్ట్రం మొత్తం స్పందించింది. సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.425 కోట్లు ఇచ్చారు. ఆరో తరగతి చదివే చిన్న కుర్రాడు నాలుగేళ్లు పొదుపు చేసుకున్న రూ.10 వేలు ఇచ్చాడు. నీకు బాధ వేయటం లేదా.. అని నేను అడిగితే వరద బాధితుల కష్టాలను తాను టీవీల్లో చూశానని, వారి కష్టం తీర్చుతున్నందుకు ఆనందంగా ఉందని సమాధానమిచ్చాడు. ఒక ఆడబిడ్డ సహాయం చేయటానికి నా దగ్గరకు వచ్చింది. భర్త చనిపోయి బయటకు రానటువంటి ఆ ఆడబిడ్డ వరద బాధితుల వేదన కొంతైనా తీర్చటానికి తాను దాచుకున్న రూ.2 లక్షలను రిలీఫ్ ఫండ్‌కు ఇచ్చింది. ప్రభుత్వంపై విశ్వాసం, నమ్మకం ఉన్నప్పుడే ఇలాంటివి సాధ్యపడతాయి.' అని చంద్రబాబు అన్నారు.

బెజవాడకు అవార్డులే అవార్డులు

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఏపీటీడీసీ నేతృత్వంలో హోటళ్లు, పర్యాటక ప్రాంతాలు, ట్రావెల్ ఏజెన్సీలకు అవార్డులను ప్రకటించారు. విజయవాడ నగరంలోని హోటల్ మినర్వా గ్రాండ్‌కు 'బెస్ట్ త్రీ స్టార్ హోటల్ అవార్డు లభించింది. జింగ్-హయత్ హోటల్‌కు 'బెస్ట్ రెస్టారెంట్, యునైటెడ్ తెలుగు కిచెన్స్‌కు 'బెస్ట్ స్టాండ్ అలోన్' రెస్టారెంట్ అవార్డులు వరించాయి. మురళీ ఫార్చ్యూన్‌లో పనిచేసే కనికెళ్ల చంద్రశేఖర్‌కు 'బెస్ట్ చెఫ్' అవార్డు లభించింది. నగరానికి చెందిన ట్రావెల్ ఐక్యూ గ్లోబల్ సొల్యూషన్స్ అనే ఏజెన్సీకి 'బెస్ట్ ట్రావెల్ ఏజెంట్' అవార్డు వరించింది. పర్యాటకాన్ని పెంపొందించే 'బెస్ట్ ఎమర్జింగ్ ట్రావెల్ కంపెనీ'గా అతిథి హాలిడేస్‌కు గౌరవం దక్కింది. 'బెస్ట్ అడ్వెంచర్ టూర్ ఆపరేటర్'గా అమరావతి బోటింగ్ క్లబ్ (ఏబీసీ) నిలిచింది.

కృష్ణానది పాయల మధ్య లంక గ్రామాల ప్రజల జీవనం ఆహ్లాదకరంగా ఉంటుంది. కాలుష్యానికి దూరంగా పచ్చని సోయగాల నడుమ ఆరోగ్యకరంగా సాగుతోంది. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు తమ పొలాల్లో పని చేసుకోవటమే తప్ప మరే యావ ఉండదు. ఇల్లు, పాడి పంటలే వారి సర్వస్వం. ఇదంతా కృష్ణానదికి వరద రానప్పుడు వారి జీవితం.

అదే వరదలు వస్తే వారి జీవనం అల్లకల్లోలమవుతుంది. బయటకు తరలించేందుకు ప్రభుత్వ యంత్రాంగం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూడాల్సిన దుస్థితి. ఈ నెల 1వ తేదీ అర్ధరాత్రి వరద ఒక్క సారిగా పెరిగి లంక గ్రామాల్లోకి ప్రవేశించింది. ఇళ్లను చుట్టుముట్టేయడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని భవనాల శ్లాబులపైకి ఎక్కాల్సిన పరిస్థితి. ఉదయం అధికారులు బోట్లపై వెళ్లి ప్రజలను తరలించాల్సి వచ్చింది. అదే గ్రామాల్లో తుఫాన్ షెల్టర్లు ఉంటే ఎన్ని వరదలు వచ్చినా తమకేం కాదని అక్కడి వాసుల నమ్మకం.



వరద ముంపులో పాములలంక(ఫైల్)

తుఫాన్ షెల్టర్లతోనే రక్షణ

పునరావాస కేంద్రాలకు తరలింపు అధికారులకు పెద్ద సాహసమే

- జీవనాధారమైన పశువులను కోల్పోతున్న పోషకులు
- 2009లోనే ఆలోచన చేసిన నాటి కలెక్టర్ పీయూష్‌కుమార్
- బయట గ్రామాల్లో స్థలాలిచ్చినా లంకలను వదలని ప్రజలు

వరదలు వస్తే లంక గ్రామాలు అతలాకుతలం

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు మండలంలో పాములలంక, తుమ్మలపచ్చికలంక, తోడేళ్ళదిబ్బలంక, కాళింగదిబ్బలంక, పొట్టిదిబ్బలంక, పిల్లివానిలంక, కనిగిరిలంక, ములకలపల్లిలంక మొత్తం ఎనిమిది లంక గ్రామాలున్నాయి. ఈ లంక గ్రామాల్లో 3,500 మంది ప్రజలు నివసిస్తున్నారు. అన్ని లంకల ప్రజలు వంద శాతం వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఆయా గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలను 5వ తరగతి వరకు చదివించి ఆ తర్వాత పైచదువులకు బయటి గ్రామాల్లోని హాస్టళ్లలో చేర్పిస్తారు. లేదా కష్టమైనా గ్రామం నుంచే ఏరుదాటి హైస్కూళ్లకు పంపుతారు. గ్రామ పంచాయతీగా ఉన్న ఒక్క పాములలంకలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం ఉంది. అక్కడ నర్సు అందుబాటులో ఉంటారు. మిగతా లంకలకు అప్పుడప్పుడు వైద్య సిబ్బంది వెళ్లి వస్తుంటారు. ఇలా వారి జీవనం సాగుతుంటుంది.

వరద వస్తేనే కష్టాలు

ఆహ్లాదకరంగా ఉండే లంక గ్రామాల ప్రజల జీవితాలు కృష్ణానదీ పాయలకు వరద వస్తే కష్టాలమయమవుతాయి. జూలై, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు ఈ నాలుగు నెలలు నదీపాయల్లో వరద ప్రవాహం కొనసాగుతుంది. ఐదు నుంచి ఆరు లక్షల క్యూసెక్కుల వరద ప్రవహించినా తమ అవసరాల కోసం ప్రతిరోజు పడవలపై కరకట్ట వెంబడి గ్రామాలకు వచ్చి వెళుతుంటారు. విద్యార్థులు కూడా పడవలపై పాఠశాలలకు వచ్చి వెళతారు. ఏడు లక్షలకు మించి భారీ వరదలు వస్తే మాత్రం ప్రజలు ప్రభుత్వం వైపు చూడక తప్పదు. అధికారులు ప్రత్యేక బోట్లు తెప్పించి ప్రజలను పునరావాస కేంద్రాలకు తీసుకు రావాల్సి వస్తుంది. ఇంటిని విడిచి రావటం, తమతో ఉన్న పశువులను అలాగే వదిలేసి రావటానికి వారి ప్రాణాలు తల్లడిల్లిపోతాయి. ఎక్కడ మెరక ఉందో అక్కడ పశువులను కట్టేసి ఇంటిలో సామాన్లు మూటకట్టి అటకలపై చేర్చి పునరావాస కేంద్రలకు వస్తారు. భారీ వరదల్లో కొన్ని పశువులు కొట్టుకుపోతుంటాయి. ఇళ్లల్లో సామగ్రి వరద పాలవుతుంది. వరద తగ్గే వరకు పునరావాస కేంద్రాల్లో తలదాచుకోవటం లంక గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితి.

తుఫాన్ షెల్టర్లు నిర్మాణమే ఏకైక మార్గం

లంక గ్రామాల ప్రజలు ఎంతటి వరద సంభవించినా అదే గ్రామంలో నిశ్చింతగా ఉండాలంటే ప్రతి గ్రామంలో ఒక తుఫాన్ షెల్టర్ నిర్మాణమే ఏకైక మార్గమని చెప్పవచ్చు. 2009 వరదల సమయంలో నాటి జిల్లా కలెక్టర్ పీయూష్‌కుమార్ పాములలంక, కనిగిరిలంక గ్రామాల్లో పడవలపై ప్రయాణించారు. ఆ సమయంలో లంక గ్రామాల ప్రజల కష్టాలను ఆయన స్వయంగా చూసి రెండు మార్గాలను ప్రజల ముందుంచారు. అన్ని లంక గ్రామాల ప్రజలను కరకట్ట వెంబడి గ్రామాలకు తరలించి ఇళ్ల స్థలాలిచ్చి గృహాలు నిర్మించటం.
రెండోది ప్రతి గ్రామంలో తుఫాన్ షెల్టరు నిర్మించటం. ఈ ఆలోచన అపుడు పుట్టింది. ఆ ప్రకారమే పాములలంక, తుమ్మలపచ్చికలంక, పిల్లివానిలంక, పొట్టిదిబ్బలంక ప్రజలకు కరకట్ట వెంబడి గ్రామాల్లో ఇళ్ల స్థలాలిస్తే తరలి రాలేదు. లంకల్లో సొంత పొలాలు, భవనాలు, పాడి పశువులు ఉండటంతో లంక గ్రామాలను శాశ్వతంగా వదిలేందుకు ఎవ్వరు ఇష్టపడటం లేదు. కష్టమైనా, నష్టమైనా లంకల్లోనే ఉంటామని చెబుతుంటారు.

ఇలా చేస్తే బాగుంటుందని..

ప్రభుత్వం ప్రతి లంకలో రెండెకరాల భూమిని సేకరించి 12 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా తట్టుకునే విధంగా మెరకపై తుఫాన్ షెల్టరు నిర్మించాలి. ఒక ఎకరంలో తుఫాన్ షెల్టరు నిర్మాణం, మిగతా ఎకరంలో పశువులను రక్షించుకోవటానికి అవకాశం ఉండేలా చేయటం. ఇలా చేస్తే ప్రతి ఏడాది వరదలకు లంక గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా ప్రభుత్వం వైపు చూడకుండా నిశ్చింతగా ఉండగలుగుతారు. వరదలు లేని సమయంలో శుభకార్యాలు చేసుకునే విధంగా పంచాయతీలు తుఫాన్ షెల్టర్లను పర్యవేక్షణ చేస్తే అన్ని విధాలుగా లంక ప్రజలకు మేలు కలుగుతుందని చెప్పవచ్చు.

షెల్టర్లుంటే వరద భయమే ఉండదు



కృష్ణానది పాయల మధ్య లంక గ్రామాల్లో నివసించటం తమకు అలవాటైపోయింది. వరదలు వచ్చినపుడు మాత్రమే అన్నీ వదిలేసి పునరావాస కేంద్రాలకు వస్తున్నాం. చాలా నష్టపోతున్నాం. అదే తుఫాన్ షెల్టరుంటే ప్రజలందరూ అందులోకి చేరి సేఫ్‌గా ఉంటారు. పశువులను అక్కడకు చేర్చుకోవచ్చు.

- పాముల శ్రీనిసవారావు, మాజీ సర్పంచ్, పాములలంక

రావాలంటేనే వీల్లేని పరిస్థితి



కనిగిరిలంక, ములకలపల్లిలంక గ్రామాలు పక్కపక్కనే ఉన్నాయి. ఈ రెండు గ్రామాల్లో 650 మంది వరకు జనాభా ఉన్నారు. వరద వస్తే ఈ రెండు లంక గ్రామాలకు కనీసం అధికారులు చేరుకోవటం ఎంతో కష్టం. అలాంటి మా గ్రామాలకు రక్షణగా తుఫాన్ షెల్టరుంటే ఎంతో మేలు జరుగుతుంది. ఎవ్వరిపై ఆధారపడకుండా వరద నుంచి గట్టెక్కుతాం.

- బూరగడ్డ వీరబాబు, కనిగిరిలంక

ప్రభుత్వం వెంటనే స్పందించాలి



2009 వరద సమయంలోనే తోడేళ్ళదిబ్బలంకలో తుఫాను షెల్టరు నిర్మించేందుకు భూ సేకరణ చేస్తామని చెప్పారు. కాని తర్వాత మరిచిపోయారు. ఇటీవల వచ్చిన వరదకు తమ గ్రామంలోని 450 మంది ప్రజలు పునరావాస కేంద్రానికి తరలి రావాల్సి వచ్చింది. చాలా కష్టాలు ఎదుర్కొన్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి అన్ని లంకల్లో తుఫాను షెల్టర్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

- గంగిశెట్టి సత్యనారాయణ, తోడేళ్ళదిబ్బలంక



బీఆర్‌టీఎస్ రోడ్డు గులాబీ తోట రైవస్ కాలువపై ఇరిగేషన్ స్థలంలో అనధికారికంగా నిర్మిస్తున్న భారీ భవనం



ప్రసాదంపాడుకు చెందిన వైసీపీ నేత ఆక్రమించిన బుడమేరు స్థలం (ఇన్‌సెట్‌లో) బుడమేరు ఆక్రమణ స్థలంలో నిర్మించిన ఫుట్‌బ్రిడ్జి

కట్టబెట్టేస్తున్నారు..

> బుడమేరు వాగు సృష్టించిన విధ్వంసానికి ప్రధాన కారణం ఆక్రమణలు. 20 మీటర్ల నుంచి 120 మీటర్ల వెడల్పు ఉండాల్సిన బుడమేరు విజయవాడ నగరంలో చాలాచోట్ల 10 మీటర్లకే పరిమితమైంది. దీంతో కాల్వ ప్రవాహ సామర్థ్యం తగ్గిపోయి వరద నీరు నగరాన్ని ముంచెత్తింది. ఇటువంటి పరిస్థితుల్లో బుడమేరు ఆక్రమణలకు చెక్ పెట్టాల్సిన నీటిపారుదల శాఖ అధికారులు కాసులకు కక్కుర్తిపడి నగరం మీదుగా ప్రవహిస్తున్న రైవస్ కాల్వ గట్లను సైతం ఆక్రమణదారులకు కట్టబెట్టేస్తున్నారు. కోట్లాది రూపాయల విలువైన వెయ్యి గజాల స్థలంలో భారీ నిర్మాణం చేస్తున్నా చోద్యం చూస్తున్నారు.

రైవస్ కాల్వపై రూ. కోట్ల విలువ చేసే స్థలం కబ్జా

- అనధికారికంగా భారీ భవన నిర్మాణం
- ప్రసాదంపాడులో ఎకరం బుడమేరు స్థలం స్వాహా
- కాసులకు కక్కుర్తిపడి వదిలేస్తున్న నీటిపారుదలశాఖ

(విజయవాడ - ఆంధ్రజ్యోతి/గుణదల) విజయవాడ నగరంలో బీఆర్టీఎస్ రోడ్డు, గులాబీ తోట ప్రాంతాల్లోని రైవస్ కాల్వ గట్టు మొత్తం ఆక్రమణలకు గురవుతోంది. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలోని ఈ స్థలం కబ్జా అవుతున్నా ఆ శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాల్లేవు. గులాబీతోట వద్ద రైవస్ కాల్వ గట్టుపై సుమారు 1,000 గజాల స్థలంలో ఓ సామాజిక వర్గానికి చెందిన కల్యాణ మండపాన్ని నిర్మిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆనాటి ప్రజా ప్రతినిధుల అండతో అడ్డగోలుగా ఈ నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. దీంతో ఆ సామాజిక వర్గానికి చెందిన ప్రతినిధులు ఆ స్థలంలో జీప్లస్ టూ భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు. బుడమేరు ఉగ్రరూపం చూసిన స్థానికులు కాల్వ గట్టుపై చేపడుతున్న ఈ భారీ భవన నిర్మాణానికి అభ్యంతరం వ్యక్తం చేసినా ఫలితం లేకుండా పోతోంది. తమ భవనానికి కౌన్సిల్‌లో ఆమోదం కూడా పొందామని భవన యజమానులు చెప్పడం గమనార్హం. ఇరిగేషన్ స్థలంలో కార్పొరేషన్ వారు కల్యాణ మంటపానికి అనుమతి ఇవ్వటం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

బుడమేరు కాల్వనూ..

విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడుకు చెందిన ఓ వైసీపీ నేత రియల్ ఎస్టేట్ సంస్థతో కలిసి ఏకంగా బుడమేరును ఎకరం మేర కబ్జా చేసి దానికి దొంగ పత్రాలు సృష్టించడం గమనార్హం. దీని విలువ రూ.7 కోట్లు వరకు ఉంటుంది. ఆక్రమించిన బుడమేరు స్థలానికి దొంగ పత్రాలు సృష్టించడానికి గతంలో ప్రసాదంపాడులో పనిచేసిన ఓ రెవెన్యూ అధికారి సహకరించారు. ఈయన ఈ భూమికి ఏకంగా పాస్ పుస్తకాలు, అడంగల్ సృష్టించేయడం గమనార్హం. తొలుత బుడమేరు చెంతనే ఉన్న పట్టా భూమిని తన బంధువుల పేరుపై కొనుగోలు చేసిన ఈ వైసీపీ నేత ఆ తర్వాత బుడమేరును పూడ్చేసి ఎకరా మేర ఆక్రమించేశారు. ఈ మొత్తం భూమికి పట్టా భూమి నంబరుతోనే పాస్ పుస్తకాలు, అడంగల్ సృష్టించేశారు. ఆక్రమించిన స్థలానికి చేరుకునేందుకు బుడమేరులో ఎలాంటి అనుమతులు లేకుండా ఫుట్‌బ్రిడ్జి నిర్మించేయడం విశేషం. ప్రస్తుతం ఈ మొత్తం విస్తీర్ణంలో ఓ రియల్ ఎస్టేట్ సంస్థతో కలిసి వెంచర్ వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అక్టోబరు 15 తర్వాతే..

- రీచ్‌లో ఇసుక తవ్వకాలకు అధికారుల ప్రయత్నాలు
- స్టాక్ పాయింట్లలో తగ్గుతున్న నిల్వలు
- కేంద్ర అనుమతులు వచ్చాక కొత్త పాయింట్లలో తవ్వకాలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : జిల్లాలోని స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వలను పెంచడానికి తవ్వకాలు చేపట్టాలని భూగర్భ గనుల శాఖ నిర్ణయించింది. ఇందుకోసం అక్టోబరు 15 తర్వాత ముహూర్తం ఖరారైంది. జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి స్టాక్ పాయింట్‌లో 56 వేల మెట్రిక్ టన్నులు, కంచికచర్ల మండలం మొగులూరు స్టాక్ పాయింట్‌లో 70 వేల మెట్రిక్ టన్నులు, కీసర స్టాక్ పాయింట్‌లో 15 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. మొత్తంగా జిల్లాలో లక్షా 41వేల మెట్రిక్ టన్నులు రెడీ ఉంది. అవసరమైన వారు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. ఈ స్టాక్ పాయింట్ల నుంచి రోజుకు 4 వేల మెట్రిక్ టన్నులను విక్రయిస్తున్నారు. అక్టోబరు 15 తర్వాత నదిలో గుర్తించిన రీచ్‌ల్లో తవ్వకాలు చేయాలని భావిస్తున్నారు.

నదిలో సర్వే

నదిలో ఇసుక లభ్యత ఎక్కడ ఉందన్న దానిపై ఇప్పటికే సర్వే చేశారు. భూగర్భ గనుల శాఖ, జలవనరుల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సంయుక్తంగా చేసిన ఈ సర్వేలో చందర్లపాడు మండలంలో మూడు ప్రాంతాలను గుర్తించారు. జగ్గయ్యపేట నుంచి కృష్ణానదిలో సర్వే చేయగా, చందర్లపాడు మండలంలో ఉన్న కాసరబాద్, కాసరబాద్ 4, రుక్కనూరు వంటి 5 ప్రాంతాల్లో 7.6 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక లభ్యత ఉన్నట్టు అంచనా వేశారు. అయితే, ఇక్కడ యంత్రాలతో తవ్వకాలకు అవకాశం ఉండదని నిర్ధారించారు. యంత్రాలతో తవ్వితే పర్యావరణానికి విఘాతం కలుగుతుందని భావించారు. ఇక్కడ నీటి లభ్యతతో పాటు ఇసుక లభ్యత ఉంటుందని గుర్తించారు. నదిలో ఇసుకను కూలీలతో తవ్వించి బోట్ల ద్వారా ఒడ్డుకు తరలిస్తారు. అక్కడి నుంచి ఎక్స్‌కవేటర్లతో లారీల్లో పోస్తారు. ఇలా చేయడానికి కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులు ఇవ్వాలి. కేంద్రం నుంచి నిపుణుల బృందం వచ్చి ఈ మూడు ప్రాంతాలను పరిశీలిస్తుంది. కాగా, ఇసుక లభ్యత ఉన్న ఈ మూడు ప్రాంతాల్లో తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలని భూగర్భ గనుల శాఖ అధికారులు కేంద్ర పర్యావరణ శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. ఇబ్రహీంపట్నం నుంచి జగ్గయ్యపేట వరకు మొత్తం 15 రీచ్‌లు ఉన్నాయి. ఇక్కడ 15 వేల క్యూబిక్ మీటర్ల ఇసుక అందుబాటులో ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఈ రీచ్‌లకు పర్యావరణ శాఖ, సీఎఫ్‌వో (కన్‌సెంట్ ఫర్ ఆపరేషన్స్), సీఎఫ్‌ఈ (కన్‌సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్) అనుమతులున్నాయి. కొత్తగా గుర్తించిన ప్రదేశాల్లో ఇసుకను తవ్వడానికి అనుమతులు రావాల్సి ఉంది.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

- కలెక్టర్ బాలాజీ

6లో



ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఉయ్యూరు పట్టణంలో జనసేన, టీడీపీ నాయకులు శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రధాన సెంటర్‌లో పేర్ని నాని దిష్టిబొమ్మను దహనం చేశారు. నానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. - ఉయ్యూరు

ఖిల్లా.. ఖిల్లాస్!



ఖిల్లాపై ప్రేమకలాపాల్లో మునిగిపోయిన యువ జంట


- ప్రేమికుల అడ్డాగా కొండపల్లి కోట
- నిఘా నిల్ - ప్రేమికులు ఫుల్
- ప్రకృతి అందాల మధ్య యువత ఆగడాలు
- వెళ్లేందుకు భయపడుతున్న పర్యాటకులు

వారికి వీకెండ్‌తో పని లేదు.. సెలవు రోజులు కానవసరం లేదు.. కళాశాలలకు డుమ్మా కొటడ్డం! కొండపల్లి ఖిల్లా ఎక్కేయడం.. అక్కడ పోలీసుల నిఘా లేకపోవడం, అడ్డు చెప్పే వారు, అడిగే వారు లేరనే ధీమా.. యువత పెడదోవ పడుతున్నారనడానికి కొండపల్లి ఖిల్లాపై కనిపిస్తున్న దృశ్యాలే నిలువెత్తు నిదర్శనం.

ఇబ్రహీంపట్నం : మానసిక ప్రశాంతత కోసం పర్యాటక ప్రాంతానికి వెళుతుంటారు చాలా మంది. మంచి పర్యాటక ప్రాంతాన్ని చూసి వీక్షించి ఆనందించి ఆ రోజంతా అక్కడి అందాలను వర్ణించుకుంటూ కుటుంబంతో ఉల్లాసంగా గడిపేస్తుంటారు. అయితే కొంత మంది ఆకతాయిలు ఇప్పుడు పర్యాటక ప్రాంతాలను అసాంఘిక నిలయాలుగా మార్చేస్తున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. పర్యాటక కేంద్రమైన కొండపల్లి ఖిల్లా ఇప్పుడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది. ముఖ్యంగా ప్రేమ జంటలు కోటను చూసే వంకతో కొండపల్లి ఖిల్లాపైకి వస్తున్నారు. కేవలం రూ.30 టికెట్ ధర చెల్లించి లోనికి వెళ్లి ఎంతసేపు కోటలో ఉంటున్నారో ఏం చేస్తున్నారో ఎవ్వరికీ తెలియని పరిస్థితి. కొన్ని జంటలు కోట లోపలికి వెళ్లి వికృత చేష్టలకు పాల్పడుతున్నారు. ఎవరు ఏ పొదలో ఏం చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితి ఇక్కడ నెలకొంది. కొందరైతే బహిరంగానే కోట గోడల పైనే అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఇక ఖిల్లా రోడ్డులో పొదల్లోకి దారులు ఉన్న చోట టూవీలర్స్ ఆగి ఉంటున్నాయి. ఎక్కడ చూసినా ప్రేమ జంటలే దర్శమిస్తున్నాయి. ముఖ్యంగా కళాశాలకు వెళ్లే యువత ప్రేమ స్పాట్‌గా ఖిల్లాను ఎంపిక చేసుకొని రోజు మొత్తం ఇక్కడే గడిపేస్తున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కోటను చూసే అనుమతి ఉంటుంది. అయితే లోనికి వెళ్లే వారు ఏం చేస్తున్నారో సరైన పర్యవేక్షణ లేదు. కోటలో ఏర్పాటు చేసిన సీసీ కెమేరాలు ఏ ఒక్కటి పని చేయడం లేదు. దీంతో పర్యాటక ముసుగులో ఉన్న ప్రేమ జంటలు మరింత రెచ్చిపోతున్నారు. నిజంగా కోట అందాలను, కొండపైన ప్రకృతి దృశ్యాలను చూద్దామని వెళ్లే వారికి ప్రేమ జంటల వ్యవహారం ఏమాత్రం మింగుడు పడటం లేదు. ఈ క్రమంలో కోటకు పర్యాటకుల సంఖ్య తగ్గిపోతూ వస్తున్నది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కోటకు ఉన్న పేరు ప్రఖ్యాతులు ఇలా అసాంఘిక కార్యకలాపాల వల్ల పోడవకుండా ఉండాలంటే గట్టి నిఘా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



ఖిల్లాకెళ్లే దారిలో ఓ జంట..



పనిచేయని సీసీ కెమెరాలు

ప్రజా సంక్షేమంలో బ్యాంకర్ల పాత్ర కీలకం

- ప్రాధాన్య రంగానికి రూ.27 వేల కోట్ల ప్రతిపాదనలు
- బ్యాంకుల వారీగా లక్ష్యాలు చేరుకునేందుకు కృషి చేయాలి
- బ్యాంకర్లు ముంపు ప్రభావిత ప్రజలకు అవసరమైన సేవలు అందించాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



బ్యాంకింగ్ వార్షిక ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్ సృజన

కృష్ణలంక, సెప్టెంబరు 27 : ప్రజా సంక్షేమం, ఆర్థిక ప్రగతి లక్ష్యంగా ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలు, కార్యక్రమాలను విజయవంతం చేయడంలో బ్యాంకర్ల పాత్ర కీలకమని, వార్షిక రుణ ప్రణాళిక (ఏసీపీ) కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిస్థాయిలో చేరుకొనేందుకు కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన బ్యాంకర్లను కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో లీడ్ జిల్లా కార్యాలయం ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన 9వ జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లాస్థాయి సమీక్ష కమిటీ (డీఎల్ఆర్‌సీ) సమావేశాలు జరిగాయి. తొలుత కలెక్టర్ సృజన, ఎల్‌డీవో పీఎం పూర్ణిమ, సమావేశ కన్వీనర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) రీజనల్ హెడ్ ఎం.శ్రీధర్, ఎల్‌డీఎం కె.ప్రియాంకతో కలిసి 2024-25 ఆర్థిక సంవత్సర బ్యాంకింగ్ వార్షిక ప్రణాళికను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 2024-25 ఆర్థిక సంవత్సరం వార్షిక రుణ ప్రణాళిక కింద వ్యవసాయ రంగానికి రూ.13,400 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగానికి రూ.11,300 కోట్లు రుణ లక్ష్యాలను నిర్దేశించినట్టు తెలిపారు. మొత్తం ప్రాధాన్య రంగానికి రూ.27 వేల కోట్లు, ప్రాధాన్యేతర రంగానికి రూ.46 వేలకోట్ల మేర లక్ష్యాలను రుణ ప్రణాళికలో పొందుపరిచినట్టు వివరించారు. ఇతర ప్రాధాన్య రంగానికి రూ.2,300 కోట్ల రుణాలను ప్రతిపాదించినట్టు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సర రుణ ప్రణాళిక లక్ష్యాల్లో ఈ ఏడాది జూన్ 30వ తేదీ వరకు పురోగతిని చూస్తే ప్రాధాన్య రంగంలో 37.81 శాతం, ప్రాధాన్యేతర రంగంలో 50.47 శాతం, మొత్తం వార్షిక ప్రణాళికలో 45.79 శాతం మేర లక్ష్యాలను చేరుకున్నట్టు వివరించారు. పూర్తిస్థాయిలో రుణ లక్ష్యాలను చేరుకొనేందుకు బ్యాంకర్లు, జిల్లా అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు పారిశ్రామిక యూనిట్లు ఏర్పాటు దిశగా ప్రోత్సహించడంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రధానమంత్రి ఉపాధి సృష్టి కార్యక్రమం, స్టాండప్ ఇండియా, ప్రధానమంత్రి ముద్రా యోజన, పీఎం స్వానిధి, ఆర్థిక అక్షరాస్యత, ఏపీ టిడ్కో-పీఎంఏవై(యూ) తదితరాలపైనా సమావేశంలో చర్చించారు.

వరద ప్రభావిత ప్రజలకు కీలకం..

గతంలో ఎప్పుడూ లేనివిధంగా విజయవాడ అర్బన్‌తో పాటు పరిసర ప్రాంతంలో ముంపు నష్టం వాటిల్లిందని, బాధితులను కష్టాల నుంచి గట్టెక్కించేందుకు వీలుగా వారికి బ్యాంకింగ్ సేవల ద్వారా ఆర్థిక చేయూతనివ్వాల్సి వుందన్నారు. ఇప్పటికే బ్యాంకింగ్ ఫెసిలిటేషన్ కేంద్రం ద్వారా రీ షెడ్యూలింగ్, కొత్త మూలధన రుణాల మంజూరు దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించడం జరుగుతోందని, దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. ప్రకృతి విపత్తు ప్రభావిత జిల్లాలో ఆర్‌బీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా బ్యాంకింగ్ సేవలు అందించాలని స్పష్టం చేశారు. సమావేశానికి వివిధ బ్యాంకుల ప్రతినిధులు హాజరయ్యారు.



దుర్గమ్మ సేవలో కర్ణాటక అటవీ పర్యావరణ మంత్రి ఈశ్వర్ ఖండ్రే

దుర్గమ్మ సేవలో కర్ణాటక మంత్రి

వన్‌టౌన్ : కర్ణాటక రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే శుక్రవారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

లడ్డూ కల్తీ ఘటనలో దోషులకు శిక్ష తప్పదు

- జంక్షన్‌లో అఖండ దీపానికి ఘన స్వాగతం



జంక్షన్ అభయాంజనేయస్వామి ఆలయంలో దేవిచంద్ర


హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 27 : తిరుమల లడ్డూ ప్రసాదం ప్రతిష్ఠను దిగజార్చిన దోషులను వేంకటేశ్వరస్వామి తప్పకుండా శిక్షిస్తాడని పెద్దాపురం శ్రీతారా వారాహి లోక కల్యాణార్థ సేవా భారత్ ట్రస్ట్ ఫౌండర్, బచ్చు ఫౌండేషన్ ఛైర్మన్ బచ్చు అవినాశ్ దేవిచంద్ర అన్నారు. లడ్డూ ప్రసాదం అపవిత్రతకు ప్రాయశ్చిత్తంగా 11 రోజుల దీక్షతో పాటు ఈ నెల 23న పెద్దాపురం నుంచి తిరుమలకు అఖండ దీపంతో చేపట్టిన పాదయాత్ర శుక్రవారం హనుమాన్‌జంక్షన్ చేరుకుంది. స్థానిక అభయాంజనేయ స్వామిని సందర్శించారు. ఈ సందర్భంగా దేవిచంద్ర మాట్లాడుతూ, గత ప్రభుత్వ వైఫల్యమో, బోర్డు సభ్యుల తప్పిదమో లడ్డూ ప్రసాదం విషయంలో పాపం జరిగిందన్నారు. దానికి ప్రాయశ్చిత్తంగా అఖండ దీపంతో పాదయాత్ర చేసి తిరుమల వేంకటేశ్వరస్వామికి సమర్పించడం జరుగుతుందన్నారు. ప్రజలు పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు.



డీఎస్సీ స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

కుల వివక్షకు వ్యతిరేకంగా జాషువా రచనలు

గవర్నర్‌పేట : సమాజంలో కుల వివక్షకు వ్యతిరేకంగా మాట్లాడిన కవి జాషువా అని శాసనమండలి సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు అనారు. కవి గుర్రం జాషువా 129వ జయంతి సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవీపీఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం పూలే, అంబేడ్కర్ భవన్‌లో నివాళి కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా టెట్, డీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం తయారు చేసిన విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ, జాషువా రాసిన కావ్యాలు ప్రజాదరణ పొందాయన్నారు. డీఎస్సీ విద్యార్థుల కోసం త్వరలో అవగాహన సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అంకయ్య, న్యాయవాది సంపర శ్రీనివాసరావు, ప్రొఫెసర్ ఎస్ లెనిన్, డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.క్రాంతికుమార్, వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగకుండా ఆపండి

- కాంగ్రెస్ నేత గిడుగు రుద్రరాజు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 27 : విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు పరం చేస్తుంటే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏం చేస్తున్నారని సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు ప్రశ్నించారు. మచిలీపట్నం బృందావనపుర కళ్యాణ మండపంలో నూతన డీసీసీగా గొల్లు కృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రుద్రరాజు మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉండగా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు పవన్ కళ్యాణ్ వ్యతిరేకించారని, అవసరమైతే ఆమరణ దీక్షకైనా దిగుతానని చెప్పారన్నారు. ఇప్పుడు పవన్ కళ్యాణ్ అధికారంలోకి వచ్చినందున కేంద్రంపై వత్తిడి తీసుకు రావాలన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లు కృష్ణ మాట్లాడుతూ, మండలాల్లో, పట్టణాల్లో కమిటీలను నియమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ధనేకుల మురళీమోహన్, వి.సంజీవరెడ్డి, మొవ్వ మోహనరావు, విజయవాడ నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నరహరశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు కదిలారు..!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ముంపు గ్రామాల్లో ఎన్యూమరేషన్

బాధితులను ఆదుకుంటాం : కేశినేని చిన్ని

కంచికచర్ల, సెప్టెంబరు 27 : విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని చిన్ని చొరవతో ఎట్టకేలకు మండలంలో వరద ముంపునకు గురైన ఇళ్ల వివరాలను సేకరించేందుకు రెవెన్యూ యంత్రాంగం కదిలింది. మండలంలోని తొమ్మిది గ్రామాల్లో ముంపుబారిన పడిన ఇళ్లను శుక్రవారం సాయంత్రం నుంచి అధికారులు ఎన్యూమరేషన్ చేస్తున్నారు. ఒకవైపు కృష్ణానది, మరోవైపు మునేరు వరద వల్ల మండలంలోని కొత్తపేట, గనిఆత్కూరు, చెవిటికల్లు, కునికినపాడు, మున్నలూరు, మోగులూరు, ఎస్.అమరవరం, వేములపల్లి, పెండ్యాల గ్రామాల్లో వందలాది ఇళ్లు ముంపునకు గురయ్యాయి. బాధితులకు జరిగిన నష్టం గురించి 'మాకు సాయం చేయరా?' అంటూ 'ఆంధ్రజ్యోతి' కథనానికి ఎంపీ కేశినేని చిన్ని స్పందించారు. కలెక్టర్ సృజనతో పాటు కంచికచర్ల తహసీల్దార్ జాహ్నవితో ఫోన్‌లో మాట్లాడారు. తొమ్మిది గ్రామాల బాధితులకు ప్రభుత్వసాయం అందించాలని ఆదేశించారు. గ్రామాల్లో తక్షణమే ఎన్యూమరేషన్ పూర్తి చేసి సాయం అందేలా చూడాలన్నారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు శుక్రవారం సాయంత్రం నుంచి గ్రామాల్లో ఇళ్ల ముంపు బాధితుల వివరాలు సేకరణ ప్రారంభించారు.

గృహనిర్మాణాలు వేగవంతం చేయండి

- కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గృహనిర్మాణాలను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, గృహనిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ బాలాజీ గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబరునుంచి గృహనిర్మాణశాఖ అధికారులతో శుక్రవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గృహనిర్మాణం చేసుకునే లబ్ధిదారులతో అధికారులు శనివారం సమావేశాలు నిర్వహించి, పనులను వేగవంతం చేసేలా అవగాహన కల్పించాలన్నారు. ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుని ఇంటినిర్మాణ పనులను వచ్చేఏడాది మార్చినెలనాటికి పూర్తిచేసేలా ప్రణాళికను రూపొందించాలన్నారు. గృహనిర్మాణంలో భాగంగా ప్రభుత్వం నుంచి ఇనుము, ఇసుక, సిమెంటు తదితర సామగ్రిని త్వరితగతిన ఇస్తామని హామీ ఇచ్చిపనులు ప్రారంభించేలా లబ్ధిదారులను చైతన్యవంతం చేయాలన్నారు. సమావేశంలో గృహనిర్మాణశాఖ ఈఈ వెంకట్రావ్, డీఈ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీ సభ్యత్వాలు పెరగాలి

- దగ్గుబాటి పురందేశ్వరి



మాట్లాడుతున్న దగ్గుబాటి పురందేశ్వరి

వన్‌టౌన్, సెప్టెంబరు 27 : రాష్ట్రంలో బీజేపీ సభ్యత్వాలు పెరగాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. భవానీపురం ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో సభ్యత్వ నమోదుపై జరిగిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో సభ్యత్వాలు ఇప్పటి వరకు 12లక్షలు మాత్రమే అయ్యాయని, లక్ష్యాలకు చేరువ కావాలని చెప్పారు. అక్టోబరు 15వరకు జరగనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొనాలన్నారు. దేశంలో 18 కోట్ల సభ్యత్వాలతో బీజేపీ ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీగా ఉందన్నారు. సభ్యులు కూడా ప్రతి ఆరు సంవత్సరాలకు ఒకసారి సభ్యత్వాలను పునరుద్ధరించుకోవాలన్నారు. మోదీ సమర్థవంత పాలన చూసి ప్రజలందరూ స్వచ్ఛందంగా పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా గత ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ఆమె విమర్శించారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో నెయ్యి కల్తీపై హిందువులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. సిట్ నివేదిక ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఏపీ జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం ఇప్పటికే రూ.12,500 కోట్లు, రాజధాని అమరావతికి రూ.15వేల కోట్లు, అనంతపురం నుంచి అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవేకు రూ.29వేల కోట్లు నిధులు అందించారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి బిజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, లాభాల బాటలోకి తీసుకురావటానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఏపీకి రైల్వే జోన్ అంశం కూడా పరిశీలనలో ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ హక్కుగా భావిస్తున్న అన్ని అంశాలను దశల వారీగా అమలు చేస్తామని చెప్పారు. జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఒకేరోజున 13వేల గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రికార్డు నెలకొల్పారన్నారు. బీజేపీ జాతీయ కార్యదర్శి అరవింద మీనన్, జాతీయ కార్యవర్గ సభ్యుడు కృష్ణదాస్, ఏపీ ప్రధాన కార్యదర్శి దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు సేవలు పూర్తి ఉచితం

- రుసుం వసూలు చేసినట్టు ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవు : కలెక్టర్ సృజన



కృష్ణలంక : పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు పథకాన్ని పటిష్టంగా అమలు చేయడంతో పాటు వైద్య సేవలపై రోగుల నుంచి ఎలాంటి రుసుములు వసూలు చేసినా ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన స్పష్టం చేశారు. ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు పథక సేవల అమలుపై శుక్రవారం కలెక్టర్ సృజన కలెక్టరేట్‌లో జిల్లా క్రమశిక్షణా కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో పథకం అమలుతీరుపై సమీక్షించారు. ఎన్టీఆర్ వైద్య సేవా పథకం పరిధిలోని నెట్‌వర్క్ ఆస్పత్రులలో నిబంధనలు అతిక్రమించి, వసూళ్లకు పాల్పడిన కొన్ని ఆస్పత్రులకు కలెక్టర్ జి.సృజన అధ్యక్షతన క్రమశిక్షణా కమిటీ జరిమానాలు విధించింది. భవిష్యత్తులో ఇలాంటి ఫిర్యాదులు పునరావృతం కాకుండా అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలందించాలని, లేకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ పేర్కొన్నారు. రోగులకు సేవలందించే విషయంలో వైద్యమిత్రలు, టీంలీడర్లు నిరంతరం అప్రమత్తంగా వుండాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీసీహెచ్ఎస్ డాక్టర్ బీసీకే నాయక్, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ జె.సుమన్ పాల్గొన్నారు.

13న గుంటూరులో ఇండియా పోస్ట్ రన్-2024

లబ్బీపేట, సెప్టెంబరు 27 : జాతీయ తపాలా వారోత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ ఆధ్వర్యంలో అక్టోబరు 13వ తేదీ ఉదయం 6 గంటలకు 'ఇండియా పోస్ట్ రన్ 2024'ను గుంటూరులో నిర్వహిస్తున్నట్టు పోస్ట్‌మాస్టర్ జనరల్ డీఎస్‌ఆర్ మూర్తి తెలిపారు. కృష్ణలంక బాలాజీనగర్‌లోని పోస్టల్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఫిట్ ఇండియా, ఫిట్ ఆంధ్రప్రదేశ్ నినాదంతో అందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో క్రీడాకారులను, యువతను ప్రోత్సహించాలనే లక్ష్యంగా ఈ రన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. 5కె, 10కె విభాగాలలో, 3కె రన్ ఫన్ రన్‌గా నిర్వహించడం జరుగుతుందని, 5కె, 10కె పురుషుల, మహిళల విజేతలకు రూ.2,40,000 వరకు నగదు రివార్డులు అందించడంతో పాటు, రన్‌లో పాల్గొనే వారికి టీషర్టు, ఫినిషర్స్ మెడల్, హైడ్రేషన్, న్యూట్రిషన్ సపోర్ట్, వైద్య సదుపాయం అందించడం జరగుతుందని తెలిపారు. 3కె రన్ 1.5కిలోమీటరు, 5కె రన్ 2.5 కిలోమీటరు, 10కె రన్ 5కిలోమీటర్లు, 25సంవత్సరాల లోపు, 25 నుంచి 40 ఏళ్ల లోపు, 40ఏళ్ల పైబడిన విభాగాలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రన్ గుంటూరులోని ఎల్ కాలేజీ నుంచి ప్రారంభమై గవర్నమెంటు మెడికల్ కాలేజీ హస్టల్, ప్రభుత్వ ఫీవర్ హస్పటల్, హోసన్నా మందిర్ మీదుగా తిరిగి ఎల్ కాలేజీ వరకు కొనసాగుతుందన్నారు. రన్‌ను మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభిస్తారని, పాల్గొనదలచిన వారు తమ వివరాలను ఇండియా పోస్టరన్ఏపీ.ఐక్యూ301.కామ్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని, విజేతలకు ఆదేరోజు బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

ఎన్టీటీపీఎస్‌లో మరో ఐదుగురు ఇంజనీర్ల బదిలీ

- ఇప్పటి వరకు 29 మందిపై చర్యలు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 29 : ఎన్టీటీపీఎస్‌లో విద్యుత్ ఉత్పత్తి విషయంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహించి యూనిట్లు ఆగిపోయేందుకు కారణమైన ఇంజనీరింగ్ విభాగంలో ఉన్నతాధికారులపై క్రమశిక్షణ చర్యల పరంపర కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో శుక్రవారం మరో ఐదుగురు ఇంజనీరింగ్ అధికారులను బదిలీ చేస్తూ జెన్కో యాజమాన్యం ఉత్తర్వులిచ్చింది. ఇప్పటి వరకు మొత్తం 29 మంది ఇంజనీరింగ్ అధికారులను బదిలీ చేస్తూ సీరియస్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తుంది. ఇంజనీరింగ్ విభాగంలో ఆస్థాయిలో గతంలో ఎన్నడూ ఎన్టీటీపీఎస్‌లో బదిలీలు జరిగిన దాఖలాలు లేవు. ఇప్పుడు జరుగుతున్న బదిలీల వెనుక బలమైన కారణాలు ఉన్నట్టు తెలుస్తున్నది. యూనిట్లు ఆగిపోవడం, వాటిని సకాలంలో పని చేయించలేకపోవడం వెనుక చాలా మంది ఇంజనీర్ల నిర్లక్ష్య ధోరణిపై జెన్కో యాజమాన్యం మండిపడుతున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే బదిలీలు జరుగుతున్నాయని టాక్ నడుస్తుంది.

న్యూస్ బాక్స్

మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా శిరీషరాణి



విజయవాడ : హైకోర్టు న్యాయవాది వల్లభనేని శిరీషరాణిని ఆంధ్రా రీజియన్(నెల్లూరు, ప్రకాశం మినహా) లోని మున్సిపాలిటీలకు స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. మూడేళ్లపాటు ఈమె బాధ్యతల్లో కొనసాగుతారు. శిరీషరాణి స్వస్థలం ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ముదినేపల్లి మండలం చేవూరు.



బెస్ట్ ఔట్‌గోయింగ్ వైద్య విద్యార్థినిగా అన్విత

విజయవాడ : సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాల బెస్ట్ ఔట్ గోయింగ్ విద్యార్థినిగా అన్విత పుట్టగుంట ఎంపికయ్యారు. 2019 నుంచి 2024 వరకు వరుసగా నాలుగేళ్లు కళాశాలలో అత్యుత్తమ విద్యా ప్రదర్శనకు గాను ఓవరాల్ బెస్ట్ స్టూడెంట్‌గా నిలిచి ఈ పురస్కారాన్ని సాధించారు. అన్విత ప్రముఖ పారిశ్రామికవేత్త, పుట్టగుంట హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ పుట్టగుంట సతీశ్ కుమార్తె. శుక్రవారం కళాశాలలో అన్వితకు మెమోంటో, ప్రశంసాపత్రం అందజేసి సత్కరించారు.

జిల్లా రవాణా శాఖ అధికారిగా మనీషా బాధ్యతల స్వీకారం



మచిలీపట్నం టౌన్ : కృష్ణాజిల్లా నూతన రవాణా అధికారి జి.మనీషా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం నుంచి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మను మనీషా మర్యాద పూర్వకంగా కలిశారు.

జగ్గయ్యపేట వైసీపీ ఇన్‌చార్జ్‌గా తన్నీరు నియామకం



జగ్గయ్యపేట : జగ్గయ్యపేట నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్‌గా తన్నీరు నాగేశ్వరరావును నియమించారు. శుక్రవారం సాయంత్రం ఆయనకు పార్టీ కార్యాలయం నుంచి ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. తన్నీరు నాగేశ్వరరావు కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా, మునిసిపల్ చైర్మన్‌గా పనిచేశారు. వైసీపీ పంచాయతీ చాంబర్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. విజ్ఞాన్ స్కూల్స్ అధినేతగా ఉన్న తన్నీరు కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పటి నుంచి సామినేని ఉదయభాను ముఖ్యఅనుచరుడిగా, సన్నిహితుడిగా పేరుగాంచారు. ఈ సందర్భంగా తన్నీరు మాట్లాడుతూ ప్రజాసమస్యలపై నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తానని, సంచాలనాల కోసం వివాదాస్పద అంశాల జోలికి వెళ్లబోమని చెప్పారు.



జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సమ్మెలో పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికుల సమ్మె

మచిలీపట్నం టౌన్ : పారిశుధ్య కార్మికుడు ఫణీంద్రను తొలగించినందుకు నిరసనగా శుక్రవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో ఆసుపత్రిలో ఎక్కడ చెత్త అక్కడే ఉండిపోయింది. 120 మంది పారిశుధ్య కార్మికులు సమ్మె బాట పట్టారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆందోళన చేపట్టారు.

వేస్ట్ టూ ఆర్ట్

ఆకట్టుకున్న ఎగ్జిబిషన్



రైల్వే స్టేషన్, సెప్టెంబరు 27 : స్వచ్ఛతా హి సేవ పక్షోత్సవాలు సందర్భంగా విజయవాడ రైల్వే డివిజన్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన కల్చరల్ ఫెస్ట్‌లో వేస్ట్ టూ ఆర్ట్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ ముఖ్య అతిథిగా పాల్గొని ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఎన్విరాన్‌మెంటల్, హౌస్‌కీపింగ్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎగ్జిబిషన్‌లోని అంశాలను ఆయన తిలకించారు. ఐకాన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, రైల్వేలోని అన్ని విభాగాల సిబ్బంది, కాకినాడ, విజయవాడ, నరసాపూర్, మచిలీపట్నం డిపోలకు చెందిన విద్యార్థులు, సిబ్బంది ఎగ్జిబిషన్‌లో తాము తయారుచేసిన అంశాలు ప్రదర్శించారు. మెటల్ స్క్రాప్ నుంచి రూపొందించిన అశ్వాన్ని విజయవాడ వేగన్ డిపో సిబ్బంది రూపొందించారు. డీఆర్ఎం మాట్లాడుతూ, స్వచ్ఛ భారత్ మిషన్ 10వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నామని, ఆరోగ్యవంతమైన, పరిశుభ్రమైన భారతదేశాన్ని, రైల్వేలను చూసేందుకు స్వచ్ఛతా హి సేవ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఇప్పటి వరకు విజయవాడ రైల్వే డివిజన్ 1200 ఈవెంట్‌లను నిర్వహించిందని, ఈరోజున నిర్వహించిన వేస్ట్ టూ ఆర్ట్ ప్రాజెక్టు రీ సైక్లింగ్ కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తుందని తెలిపారు. అదనపు డీఆర్ఎంలు పి.ఈ. ఎడ్విన్, కొండా శ్రీనివాసరావు, తదితరులు పర్యావరణ పరిరక్షణ, తదితరాల గురించి మాట్లాడారు. విద్యార్థులు కల్చరల్ ఫెస్ట్‌లో తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందచేశారు. డీఈఎన్ ఎం.కిషోర్ వందన సమర్పణ చేశారు.



వేస్ట్ టు ఆర్ట్ ప్రదర్శనను తిలకిస్తున్న డీఆర్ఎం ఎ పాటిల్

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)



బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.530



సీఎం సహాయనిధికి రూ.2 లక్షల విరాళం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 27 : వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి బందరుకు చెందిన ఇద్దరు మహిళలు రూ. 2 లక్షల అందజేశారు. మేడింపూడి గీత, డాక్టర్ మండవ వాణి రూ. లక్ష విరాళాన్ని చెక్కుల రూపంలో విజయవాడలో సీఎం చంద్రబాబుకు అందజేశారు. సహాయనిధికి విరాళం ఇచ్చిన మహిళలను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు

పీడీపై పోక్సో కేసును నిరసిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రుల ధర్నా

గుడివాడ రూరల్ : చౌటపల్లి జడ్పీ పాఠశాల పీడీ జి.ఎం.చంద్రశేఖర్‌రావును పోక్సో చట్టం కింద అరెస్టు చేయటాన్ని ఖండిస్తూ విద్యార్థులు, పిల్లల తల్లిదండ్రులు పాఠశాల ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. బాలికను బ్యాడ్ టచ్ చేస్తున్నట్లు విద్యార్థిని తల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్సై చంటిబాబు విచారణ నిర్వహించి పీడీని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. విషయం తెలుసుకున్న విద్యార్థులు పాఠశాల వద్ద నిరసన తెలిపారు. పీడీ మంచి వ్యక్తి అని, వెంటనే విడుదల చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఒక ఉపాధ్యాయుడు పీడీని కావాలనే ఈ కేసులో ఇరికించాడని విద్యార్థులు. తల్లిదండ్రులు పేర్కొన్నారు. డీవైఈవో పద్మారాణి, ఎంఈవో బి.బాలాజీ పాఠశాలను సందర్శించి విచారణ నిర్వహించారు. డీఈవో ఆదేశాల మేరకు పీడీ చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే మండలికి వెలివోలు లంక రైతుల సన్మానం



చల్లపల్లి : పంటలకు ఈ క్రాప్ చేయించి వరద నష్టపరిహారం వచ్చేలా చూసిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు వెలివోలు లంక రైతులు శుక్రవారం కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. వెలివోలు లంకలో 136 మంది రైతులు మల్బరీ, పసుపు, కంద, అరటి పంటలు వరద కారణంగా నష్టపోయామన్నారు. ఎమ్మెల్యే చొరవతో ఈ క్రాప్ నమోదుచేయించి పంట నష్టపరిహారం మంజూరుకు కృషిచేశారన్నారు తమ సమస్య పరిష్కారానికి కృషిచేసిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, యువనేత మండలి వెంకట్రామ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. వెలివోలు రైతులు కోనేరు శ్రీనివాసరావు, పెనుమత్స కృష్ణ పెనుమత్స రాజారత్నం, అశోక్, కుంపటి శివశంకర్, గొరికపూడి శేఖర్, కొడాలి వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావులు తదితరులు పాల్గొన్నారు.



ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలు గోపీచంద్, కొట్టె వెంకట్రావు తదితరులు



ఎంపీడీవో వెంకట రమణకు ప్రశంసా పత్రం అందజేస్తున్న వెనిగండ్ల



మంగినపూడిలో మాట్లాడుతున్న గోపు సత్యనారాయణ

ఆశించిన అభివృద్ధి సాధించాం

● టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 27 : ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం ఆశించిన అభివృద్ధిని సాధించిందని టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. 39వ డివిజన్‌లో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం ముగింపు కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోటమర్రి బాబాప్రసాద్, అక్కుమహంతి రాజా, కట్టా అంజిబాబు, జనసేన నాయకుడు కొట్టె వెంకట్రావు, బీజేపీ నాయకుడు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి తదితరులతో కలిసి ఆయన పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలను నెరవేరుస్తోందన్నారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలెండర్లు పంపిణీ చేస్తారన్నారు. వరద బాధితులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లిస్తోందన్నారు. **గుడివాడ :** సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, అదే విధంగా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శ్రీరాంపురంలోని వెలమ సంక్షేమ సంఘ భవన్‌లో 4,5,7,9,10,11,12,17 వార్డుల పరిధిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం, కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. **గుడివాడ రూరల్ :** కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నియోజక వర్గంలో రూ.17.50 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. లింగవరం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. లింగవరంలో రూ. 50 లక్షలతో నిర్మించే సీసీ రహదారులకు భూమి పూజ చేశారు. లింగవరం ప్రతి ఇంటికి తాగునీటి కుళాయిలు ఉన్న గ్రామంగా ఎన్నికైన సందర్భంగా గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో ఏ.వెంకట రమణకు ప్రశంసాపత్రం అందజేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావును అభినందించారు. వాసే మురళీ, బూరగడ్డ శ్రీకాంత్, దావులూరి సురేంద్ర, కాటూరి జాన్ శ్యామ్యూల్, గాదిరెడ్డి చిరంజీవి రెడ్డి, కాటూరి ఏసుపాదం, మందపాటి గోపాలస్వామి, తహసీల్దార్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **నందివాడ (గొంగళ్లమూడి) :** నమ్మకంతో నన్ను గెలిపించిన ప్రజల ప్రతి సమస్యను తీర్చే బాధ్యత తనదని, ప్రతి వ్యక్తికి పని కల్పిస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు.గొంగళ్లమూడి కల్యాణ మండపంలో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. మండలంలో రోడ్ల పరిస్థితిదారుణంగా ఉన్నాయని, నెల రోజుల్లో మరమ్మతు చేపడతామన్నారు. ఐదేళ్లలో ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు వేయిస్తానన్నారు. పిన్నమనేని పూర్ణ వీరయ్య (బాబ్జి), బూరగడ్డ శ్రీకాంత్, దానేటి సన్యాసిరావు, సర్పంచ్ సీతామహాలక్ష్మి, ఝాన్సీ కుమారి, ఎంపీడీవో నాగేశ్వరరావు, తహసీల్దార్ మల్లి, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు. **కోడూరు :** గ్రామాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కోడూరు మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు అన్నారు. కోడూరు గ్రామపంచాయతీ పరిధిలోని అంబటి బ్రాహ్మణయ్య కాలనీలో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కూటమి ప్రభుత్వం 100 రోజుల్లో చేసిన అభివృద్ధి కరపత్రాలను ప్రజలకు అందించి, సంక్షేమ పథకాలు వివరించారు. కూటమి నాయకులు ఉల్లి శేషగిరిరావు, బచ్చు వెంకటేష్, దామెర్ల నారాయణ, గోగినేని సోమశేఖరరావు, బెల్లంకొండ కోటేశ్వరరావు, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, యార్లగడ్డ రమణ, బెల్లంకొండ శ్రీమన్నారాయణ, గాదె అనిల్, నారగం కోటేశ్వరరావు, మహమ్మద్ ఇమ్రాన్, మోర్ల మాణిక్యాలరావు, బండే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో నష్టపరిహారం జమ

మచిలీపట్నం టౌన్ : వరదల వల్ల పంట నష్టపోయిన రైతుల ఖాతాల్లోకి సీఎం చంద్రబాబు నష్టపరిహారం జమ చేయించారని తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. బందరు మండలం మంగినపూడి, తపసిపూడి గ్రామాల్లో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో గోపు సత్యనారాయణ, రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు కుంచే నాని, క్లస్టర్ ఇన్‌చార్జి లంకే శేషగిరి, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మాజీ అధ్యక్షుడు తలారి సోమశేఖర్, సిరివెళ్ల సాంబయ్య, లంకే శేషగిరి, మెండు భానుమూర్తి, శ్రీపతి నాంచారయ్య, తోట రాము, కూనపరెడ్డి స్వామి తదితరులు పాల్గొన్నారు.



మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆలపాటి రాజా, బుద్ధప్రసాద్ తదితరులు

గొప్ప మానవతావాది

ఎంవీకే వర్ధంతి కార్యక్రమంలో వక్తలు



నాగాయలంకలో ఎంవీకేకు నివాళులర్పిస్తున్న నేతలు



మోపిదేవిలో రక్తదాన శిబిరం

అవనిగడ్డ : మండలి వెంకట కృష్ణారావు(ఎంవీకే) గొప్ప మానవతా వాది అని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. దివిసీమ గాంధీ మండలి వెంకట కృష్ణారావు వర్ధంతిని దివిసీమలో శుక్రవారం నిర్వహించారు. అవనిగడ్డ వంతెన సెంటర్‌లోని మండలి వెంకట కృష్ణారావు, విగ్రహానికి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీక్షేత్రంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని మాజీ మంత్రి ఆలపాటి రాజా మండలి బుద్ధప్రసాద్‌తో కలసి ప్రారంభించారు. మండలి వెంకట్రామ్, మత్తి శ్రీనివాసరావు, పూతబోయిన సీతారత్న సాయిబాబు, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు చిలకలపూడి పాపారావు పాల్గొన్నారు.హెచ్‌సీజీ క్యూరీ, డాక్టర్ గోపిచంద్ క్యాన్సర్ ఆసుపత్రి, క్యాపిటల్ ఆసుపత్రి వైద్యులచే 350 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. **అవనిగడ్డ రూరల్ :** పులిగడ్డ టోల్‌ప్లాజా వద్ద ఎంవీకే విగ్రహానికి గ్రామీణ మండలి వెంకట్రామ్ (రాజా) ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఇరిగేషన్ కార్యాలయం సమీపంలోని మండలి విగ్రహానికి, పులిగడ్డలో ఎంవీకే - ప్రభావిత దేవి విగ్రహాల వద్ద నివాళులర్పించారు. మండలి వెంకట శేషగిరిరావు, సుధీర్, మాజీ సర్పంచ్ చెన్ను గాంధీ, జనసేన నాయకులు గుడివాక నరహరి, కోట సాయి పాల్గొన్నారు. ఎంపీటీసీ సభ్యుడు బొప్పన భాను ఆధ్వర్యం లో కొత్తపేట రామాలయ మం వద్ద ఉచిత నేత్ర వై ద్యశిబిరం ఏర్పాటు చేశారు. **మోపిదేవి :** మోపిదేవి టీడీపీ కార్యాలయంలో ఎంవీకే చిత్రపటానికి నడకుదుటి జనార్ధనరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్‌లు దిడ్ల జానకి రాంబా బు, పైడిపాముల కృష్ణకుమారి, ఎంపిటిసి కొమ్ము పవన్ కుమార్, పార్టీ నాయకులు రావి నాగేశ్వరరావు, కావూరి రామకృష్ణ, చెన్ను రంగారావు, బల్లా సీతారామ ప్రసాద్, పుప్పాల ఏసు, నందిగం శ్రీను పాల్గొన్నారు. **నాగాయలంక :** నాగాయలంక, భావదేవరపల్లి, తలగడదీవి గ్రామాల్లో ఎంవీకే విగ్రహాలకు ఘన నివాళులర్పించారు. మండల టీడీపీ అధ్యక్షులు మెండు లక్ష్మణరావు, తలశిల స్వర్ణలత, తలశిల నాని, ఉప్పల ప్రసాద్, సజ్జా గోపాలకృష్ణ, తలశిల బుల్లయ్య చౌదరి, వర్రే రాంబాబు, మండలి ఉదయభాస్కర్, లకనం నాగాంజనేయులు, కర్రి కృష్ణమూర్తి, అంబటి శ్యామ్ ప్రసాద్, చిట్టా వీర అన్నపూర్ణయ్య, మాదివాడ అర్జునరావు, బండ్రెడ్డి చినబాబు, బోసు, హరి, గడ్డిపాటి నాగేశ్వరరావు, బండ్రెడ్డి మల్లిఖార్జునరావు, భోగాది చిన్నారి, బబ్బి, చిరివేళ్ల నాగరాజు, తలశిల శివరామకృష్ణ, బోనం పాపారావు, ముమ్మారెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు. **ఘంటసాల :** శ్రీకాకుళంలో ఎంవీకే విగ్రహానికి ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), జనసేన నేతలు నివాళులర్పించారు. ఉపసర్పంచ్ శీలం శ్రీను, దాసం రామకృష్ణ, కొండవీటి నాని, తాడికొండ సాయి తేజ, మదాసు వినయ్, కొల్లా రిచిత్, స్వామి, కొండవీటి రవి, తిరుమలశెట్టి మల్లి, కుంపటి చిట్టిబాబు, శివ, జీళ్ల శ్రీనివాస్, సిద్ధూ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **కోడూరు :** దివిసీమ అభివృద్ధి ప్రదాతగా ఎంవీకే ఖ్యాతి ఘడించారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. వర్ధంతి సందర్భంగా కోడూరు మండల కూటమి నాయకులు బండే శ్రీనివాసరావు, ఉల్లి శేషగిరిరావు, బచ్చు వెంకటేష్, ముద్దినేని చంద్రరావు, వేములపల్లి శ్రీకృష్ణ, గోగినేని సోమశేఖరరావు ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా కోడూరు ప్రధాన సెంటర్‌లో ఎంవీకే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పూతబోయిన శ్రీనివాసరావు, పిల్లి మల్లిఖార్జునరావు, సుంకర లక్ష్మి, తోట రాంబాబు, దామర్ల నారాయణ, మద్దూరి కాంతారావు, దేవనబోయిన వెంకటేశ్వరరావు, అద్దంకి పాండురంగారావు, మేడా శివాజీ, బొలిశెట్టి విఠల్‌రావు, తాతా పోతురాజు, పోతురాజు, రాజేష్, కాగిత ప్రసాద్, తోట లక్ష్మణరావు, శివయ్య, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.**మోపిదేవి :** ఒక వ్యక్తి రక్తదానం చేయటం ద్వారా ముగ్గురి కాపాడగలిగిన వారు అవుతారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మోపిదేవి సబ్ బ్రాంచ్, గ్రామీణ యువజన వికాస సమితి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మోపిదేవిలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారం భించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ టి.ఎస్.ఎస్. బాలాజీ, కె.బిఎన్ కళాశాల ప్రిన్సిపాల్ వంగర నారాయణ, మండలి వెంకట్రామ్, కె.రామబాలాజీ, భవిరి శంకర్ నాథ్, రావి బాబురావు, రావి నాగేశ్వరరావు, నడకుదుటి జనార్దనరావు సర్పంచ్ లు నందిగం మేరీ రాణి, ఏసుబాబు, రాంబాబు, సాంబశివరావు, రావి రత్నగిరి, మోపిదేవి సబ్ బ్రాంచ్ ఛైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు, లీలా బ్రహ్మేంద్ర, ఆర్.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. **చల్లపల్లి :** మండలి వెంకట కృష్ణారావుకు చల్లపల్లిలో నేతలు ఘన నివాళులు అర్పించారు.సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి , ఆకుల స్వభూప్రసాద్, జివి.తాతారావు, మిరియాల లక్ష్మీనారాయణ, తుటారం ప్రసాద్, బొందలపాటి వీరబాబు, తోట కనకదుర్గ, పసుపులేటి రవికుమార్, సూదాని నందగోపాల్, అడపా రవి, రావి రాజేశ్వరరావు, రాయవరపు నాంచారయ్య పాల్గొన్నారు.

చల్లపల్లి రిజిస్ట్రార్‌గా ప్రసాద్



చల్లపల్లి : చల్లపల్లి సబ్ రిజిస్ట్రార్‌గా కుంచె ప్రసాద్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఎన్టీఆర్ జిల్లా గుణదల జాయింట్ - 2 సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ప్రసాద్ బదిలీలో భాగంగా చల్లపల్లి వచ్చారు. సీనియర్ అసిస్టెంట్‌గా తాడేపల్లి శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్‌లుగా పూర్ణచంద్రరావు, అనూష విధుల్లో చేరారు. సబ్‌రిజిస్ట్రార్‌ను దస్తావేజు లేఖరులు సన్మానించి శుభా కాంక్షలు తెలిపారు.

మొవ్వ సబ్ రిజిస్ట్రార్‌గా సత్యనారాయణ



కూచిపూడి : మొవ్వ సబ్ రిజిస్ట్రార్‌గా అంబటి సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడలోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌లో ఆడిట్ విభాగంలో విధులు నిర్వహిస్తూ మొవ్వకు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు మొవ్వలో పని చేసిన ఎల్.వెంకటేశ్వరరావు పెడన కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. కార్యాలయ సిబ్బంది నూతన రిజిస్ట్రార్‌కు అభినందనలు తెలిపారు.

పెడన టీపీవోగా సుజనకుమారి



పెడన : పెడన మునిసిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారిగా నియమితులైన టి.సుజనకుమారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె మచిలీపట్నంలోని ముడా కార్యాలయం నుంచి బదిలీపై పెడనకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన సుజన కుమారికి పట్టణ పరిధిలోని తొమ్మిది సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలు శుభాకాంక్షలు తెలిపారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

పెడన: నెల్లూరు జిల్లా కోవూరు మండలం చినపడుగుపాడు పంచాయతీ శివారు నేతాజీ నగర్‌కు చెందిన సముద్రాల శివశంకర్ (41) పెడన రైల్వేస్టేషన్‌వద్ద వాహనాల పార్కింగ్ ప్రదేశంలో శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. పోలీసులు అతని ఫ్యాంటు జేబులోని ఆధార్‌కార్డు ద్వారా వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబసభ్యులు వచ్చి మృతదేహాన్ని తీసుకుని వెళ్ళిపోయారు.

డ్రెయిన్లను పరిశీలించిన అడ్డాడ

చల్లపల్లి : అధికారుల నిర్లక్ష్యం రైతులపాలిట శాపంగా మారిందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ అన్నారు. మంగళాపురంలో గుర్రపుడెక్కతో నిండిన డ్రెయిన్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేనికారణంగానే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలన్నీ నీటమునిగాయన్నారు. రైతుసంఘం నాయకులు చంద్ర సుబ్బారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

45 మందికి ఉద్యోగాలు

మచిలీపట్నం టౌన్ : ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనాశాఖ, డీఆర్డీఏ సంయుక్తంగా జ్యూయలరీ పార్కులో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించాయి. ఈ జాబ్‌మేళాకు 123 మంది నిరుద్యోగులు హాజరు కాగా వారిలో 45 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఇమిటేషన్ జ్యూయలరీ పార్కు వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి అంకెం జితేంద్ర కుమార్ మాట్లాడుతూ యువతకు జ్యూయలరీ పార్కులో ఉపాధి కల్పిస్తున్నామన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.విక్టర్‌బాబు, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి సూర్య నరేంద్ర, కె.దిలీప్, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

బాధితులకు సీఎం సాయం

పామర్రు : నిరుపేదల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం పాటుపడుతుందని ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. సహాయనిధి నుంచి మంజూరైన రూ11. 56 లక్షల విలువైన చెక్కులను 14 మంది బాధిత కుటుంబాలకు ఆయన అందజేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, జనసేన ఇన్‌చార్జితాడిశెట్టినరేష్, జక్కాశ్రీనివాసరావు, వల్లూరిపల్లి గణేష్ రామంజనేయులు,శోభన్‌బాబు,పాల్గొన్నారు.

దొండపాడు పీఏసీఎస్ తనిఖీ

గుడివాడ రూరల్ : రికార్డులు సక్రమంగా నిర్వహించాలని దొండపాడు పీఏసీఎస్ ఇన్‌చార్జ్ కనకరత్నమ్మ అన్నారు. దొండపాడు సొసైటీని శుక్రవారం ఆమె పరిశీలించారు. వివిధ అంశాలను దొండపాడు కార్యదర్శి ఉప్పులూరు నాగమల్లేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సేవలందించాలని కోరారు. దొండపాడు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ముసునూరి రాజేంద్రప్రసాద్, నూతక్కి కుటుంబరావు, పున్నారావుపాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం

కోడూరు: గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి అన్నారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉల్లిపాలెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద బాలింతలకు, గర్భిణిలకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామసర్పంచ్ పావని, ఏఎన్ఎం కృష్ణవేణి, అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

వీల్‌చైర్ వితరణ

పామర్రు : పామర్రు పట్టణానికి చెందిన నందిపాటి వెంకటరామకృష్ణ ఆయన సోదరులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వీల్‌చైర్‌ను అందజేశారు. బదిలీపై వెళ్తున్న సబ్ రిజిస్ట్రార్ సత్యవతిని దస్తావేజులేఖర్లు ఘనంగా సత్కరించారు. గోగినేని సుబ్బారావు, ఆర్‌వెంకటేశ్వరరావు, ఉదయ్‌కిరణ్, ఎన్‌వి ఆర్ రెడ్డి నందిపాటి లక్ష్మిరెడ్డి మర్రిదుర్గారావు, మురళి, దోనేశ్రీదర్ పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

కూచిపూడి : సమగ్ర శిక్షా, ఎల్.వి.ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్, జిల్లా అధ్వంత నివారణ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో మొవ్వ జడ్పీ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఎంఈవోలు శివశంకర్, శ్రీలక్ష్మి, సమగ్ర శిక్షా అసిస్టెంట్ ప్రోగ్రామ్ అధికారి కె.ఏడుకొండలు, ప్రకాష్, చందు, జాషువా, భూపాల్ ఆచారి, హెచ్ఎం శ్రీదేవి పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

గూడూరు : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. శుక్రవారం గూడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నియోజకవర్గ స్థాయి క్రీడలను ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ ప్రారంభించి ప్రసంగించారు. పోతన స్వామి, గోపీ నాగబాబు, ఎన్‌ఏ బేగ్, విద్యా కమిటీ ఛైర్మన్ పోతన కృష్ణారావు, మాజీ సర్పంచ్ రామోజీ, కోలపల్లి రజని, కట్టా మునీశ్వరరావు,సత్యనారాయణ, బానంశెట్టి శ్రీనివాసరావు, సోమయ్య, కె. నాగమురళి, తహసీల్దార్ రాజలక్ష్మి, పుష్పలీల, మత్తి అరుణ, పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై ఫిర్యాదు

గుడివాడ రూరల్ : శేరీదింటకుర్ర పాఠశాల ఉపాధ్యాయులు సక్రమంగా పని చేయటం లేదని విద్యార్థుల తల్లులు ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీవో ఏ.అనగాని వెంకటరమణ తెలిపారు. విద్యార్థుల తల్లులు వి.నాగమంజరి, కృష్ణ, అనిత కుమారి తదితరు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఉపాధ్యాయుడు పాఠశాలకు సక్రమంగా రావటం లేదని, తమ పిల్లలు అక్షరాలు కూడా మరిచిపోతున్నారని చెప్పినట్లు తెలిపారు. ఎంఈవో బాలాజీని విచారణకు వెళ్లాలని ఆదేశించినట్లు ఆమె తెలిపారు.

వేణుగోపాలస్వామి దేవస్థాన ఈవోగా గోపాలరావు

గుడివాడ : కాకర్ల వీధి వేణుగోపాలస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా కె.వి.గోపాలరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు(వాసు) గోపాలరావుకు బాధ్యతలు అప్పగించారు. అర్చకులు, పండితులు గోపాలరావుకు శుభాకాంక్షలు తెలిపారు.


వాసవి రూ.లక్ష వితరణ

పెడన రూరల్ : నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాల యా జమాన్యం వరద బాధితుల సహాయార్థం లక్ష రూపాయల చెక్కును పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు అందజేసింది. విద్యార్థులు, సిబ్బంది సేకరించిన వి రాళాలు మొత్తాన్ని కళాశాల కరస్పాండెంట్ కాకి కుమార్‌బాబు, డైరక్టర్ డి బాబా, పిన్సిపల్ బిఆర్ఎస్ రెడ్డి, ఎస్‌వికెప్రసాద్, డి రాజారమేష్ ఎమ్మెల్యేకు అందజేశారు.

కొనకళ్లకు ఎమ్మెల్యే బోడె అభినందన

మచిలీపట్నం టౌన్ : ఏపీఎస్‌ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమితులైన కొనకళ్ల నారాయణరావును పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర నాయకులు బుల్లయ్య, దాసు, పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

నేటి రైతు సదస్సును జయప్రదం చేయండి

ఉంగుటూరు, సెప్టెంబరు 27 : వరదల్లో నష్టపోయిన రైతులు, కౌలురైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఉంగుటూరులో శనివారం నిర్వహించే రైతు సదస్సులో రైతులు, కౌలురైతులు పాల్గొనాలని కౌలురైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ లక్ష్మణస్వామి కోరారు. శుక్రవారం ఉంగుటూరులో ఆయన మాట్లాడుతూ, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బుడమేరు, పిల్లికోడు, వన్నేరువాగులకు ఉధృతంగా వరదనీరు చేరడంతో మండలంలోని కొయ్యగూరపాడు, ఆముదాలపల్లి, ఉంగుటూరు, గారపాడు, ముక్కపాడు, లంకపల్లి, ఓంద్రంపాడు, ఇందుపల్లి, వేంపాడు, చాగంటిపాడు, తరిగొప్పల, వెల్దిపాడు, ఎలుకపాడు తదితర గ్రామాల్లో పొలాలు నీటమునిగాయన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అజ్మీర్ వెంకటేశ్వరరావు, కడవకొల్లు రామరాజు పాల్గొన్నారు.

హిందూ ధర్మ వ్యతిరేకి పేర్ని

- కూటమి నేతల ఫైర్
- పెనమలూరు, ఉయ్యూరులో పేర్ని నాని దిష్టిబొమ్మ దహనం
- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్



పేర్ని నాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

పెనమలూరు, సెప్టెంబరు 27 : హిందూ ధర్మ వ్యతిరేకి పేర్ని నాని అని, ప్రతి దేవుణ్ని కించపరిచే విధంగా మాట్లాడుతున్న మానవ సైకో అని పెనమలూరు నియోజకవర్గ కూటమి నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. శుక్రవారం తాడిగడప మునిసిపాలిటీ కానూరులో జరిగిన నిరసన కార్యక్రమంలో వారు పెద్ద ఎత్తున పాల్గొని పేర్ని నాని దిష్టిబొమ్మను దహనం చేశారు. తిరుమల తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వైసీపీ నాయకులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు, టీడీపీ, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా, తాడిగడప జనసేన అధ్యక్షుడు తాతపూడి గణేష్‌లు ఈ సందర్భంగా మాట్లాడుతూ, తిరుమల తిరుపతి లడ్డూ విషయంలో పవన్‌కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన పేర్ని నాని క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో కూటమి కార్యకర్తల, నాయకులు ఆగ్రహాన్ని చవిచూడవలసి వస్తుందని హెచ్చరించారు. టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో జనసేన, టీడీపీ నాయకుల నిరసన ప్రదర్శన

ఉయ్యూరు సెంటర్‌లో..

ఉయ్యూరు : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై మాజీ మంత్రి పేర్ని నాని చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఉయ్యూరు పట్టణ జనసేన, టీడీపీ నాయకులు శుక్రవారం నిరసన ప్రదర్శన చేశారు. ప్రధాన సెంటర్‌లో నానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పేర్ని నాని దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా, ఆదినారాయణ, బొప్పన ప్రసాద్, ఓంకార్, వెంకటేష్, మహాలక్ష్మి, టీడీపీ నాయకులు జంపాన పూర్ణచంద్రరావు, చిరంజీవి, పలియాల శ్రీనివాసరావు, రమేశ్, బూరెల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రులు వైభవంగా నిర్వహించాలి



ఉత్సవ కమిటీ సభ్యులకు సూచనలిస్తున్న తుమ్మలపల్లి హరికృష్ణ

కంకిపాడు, సెప్టెంబరు 27 : దసరా నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని ఉత్సవ కమిటీ పర్యవేక్షకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. ఆలయ కమిటీతో కలిసి శుక్రవారం ఆయన ఆలయాన్ని సందర్శించారు. దసరా ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ అర్చకులు సుబ్బారావు, కిషోర్, కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ, దసరా ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆదేశించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఛైర్మన్ దివి రోహిణి, వైస్ ఛైర్మన్ పులి శ్రీనివాసరావు, సభ్యులు గోగినేని వెంకట రమణ, కొండా నాగేశ్వరరావు, బొర్రా వెంకట్, వణుకూరు విక్రం, చలవాది రాజా, ఏనుగ జయప్రకాష్, వద్దాది శ్రీను, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ సిద్ధార్థలో ఉపకార వేతనాల పంపిణీ

పెనమలూరు, సెప్టెంబరు 27 : స్థానిక వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం మెరిట్ ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి అనుకూలంగా బీటెక్ ప్రోగ్రాంలో ప్రవేశం పొందిన విద్యార్థుల అసాధారణ విద్యావిజయాలను దృష్టిలో ఉంచుకొని ఉపకారవేతనాలు పంపిణీ చేసినట్లు కళాశాల కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు పేర్కొన్నారు. 485మంది విద్యార్థులకు రూ. 1.59 కోట్లను ఉపకార వేతనాలుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ ఎం. రవిచంద్, ఏవో సాయిబాబు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి సామగ్రి అందజేత



సామగ్రి అందజేస్తున్న దేవినేని రాజా

ఈడుపుగల్లు (కంకిపాడు), సెప్టెంబరు 27 : ఈడుపుగల్లు గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి మాజీ ఎంపీపీ దేవినేని రాజా శుక్రవారం గ్లౌజులు, సబ్బులు, డెటాయిల్ తదితర సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ, నిత్యం ప్రజాసేవలో పనిచేసే పారిశుధ్య సిబ్బంది అవసరాలను తీర్చాల్సిన బాధ్యత ఆయా పంచాయతీలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పందిపాటి ఇందిర, ఈవో అహ్మద్, టీడీపీ జిల్లా కార్యదర్శి పందిపాటి సుధాకర్, గ్రామ పార్టీ అధ్యక్షులు షేక్ షకూర్, స్థానికులు చెల్లి సంగీతరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు



మండలస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన బాలికలు

ఉయ్యూరు, సెప్టెంబరు 27 : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా జరిగిన మండలస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా బాలబాలికల క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్ అంశాల్లో అండర్ -14, అండర్ -17 బాల బాలికల ఎంపికలు నిర్వహించారు. మండలస్థాయిలో ఎంపికైన బాలబాలికలు త్వరలో జరుగనున్న నియోజకవర్గస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో మండలం తరపున పాల్గొంటారని స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జీవీ రమణ తెలిపారు. ఎంఈవో బి. సుధారాణి, పాఠశాల హెచ్‌ఎం కె. జ్యోత్స్నదేవి పర్యవేక్షించారు.

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయాలి



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఎంఈవో ప్రసాద్

ఈడుపుగల్లు (కంకిపాడు) : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ఉపాధ్యాయులు వెలికితీయాలని ఎంఈవో కె.ఎస్.వి. ప్రసాద్ అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన వేస్ట్ టూ ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేస్ట్ నుంచి వివిధ కళాకృతులను విద్యార్థులు తయారు చేయడం అభినందనీయమన్నారు. హెచ్‌ఎం పద్మావతి, ఆర్గనైజర్ పీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

వీరవల్లి విద్యార్థుల ప్రతిభ

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి ఆటల పోటీల్లో వీరవల్లి విద్యార్థులు ప్రతిభ చాటారని హెచ్‌ఎం నిర్మల తెలిపారు. వీరవల్లి హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన పీడీని అభినందించారు.

వీరవల్లి కనకదుర్గమ్మ ఆలయానికి పంచలోహ ఉత్సవ విగ్రహం బహూకరణ



హనుమాన్‌జంక్షన్‌రూరల్ : వీరవల్లి కనకదుర్గ ఆలయానికి పంచలోహాలతో కూడిన ఉత్సవ విగ్రహాన్ని దాతలు శుక్రవారం అందజేశారు. కోడూరుపాడుకు చెందిన వైస్ ఎంపీపీ చందు రమాదేవి, శ్రీనివాసరావు దంపతులు, తాతారావు స్వామి, చక్క ఫణి, శివకుమార్ ఉత్సవ విగ్రహాన్ని ఆలయ ఛైర్మన్ సూర్యప్రకాష్ దంపతులకు అందజేశారు. లీలా జయకృష్ణ ఆచార్య ఆధ్వర్యంలో ఉత్సవమూర్తికి ధాన్యాధివాసం, పుష్పాధివాసం, పూజలతో పాటు పంచామృతాభిషేకం నిర్వహించారు.

కొనకళ్లకు అభినందనల వెల్లువ



కొనకళ్లను అభినందిస్తున్న ఎమ్మెల్యే బోడె తదితరులు

పెనమలూరు, సెప్టెంబరు 27 : నూతనంగా ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్‌గా ఎంపికైన మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ స్థానిక బీసీ నాయకులతో కలిసి మచిలీపట్నంలోని ఆయన నివాసంలో శుక్రవారం అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, మారుపూడి ధనకోటేశ్వరరావు, టీడీపీ పెనమలూరు, కంకిపాడు మండలాధ్యక్షులు కోయ ఆనంద్‌ప్రసాద్, సూదిమళ్ల రవీంద్ర, నియోజకవర్గ బీసీ అధ్యక్షులు సంగెపు రంగారావు, శొంఠి శివరాంప్రసాద్, పీతా గోపీచంద్, వీరంకి కుటుంబరావు, బలగం నాగరాజు, శశికాంత్ ఉన్నారు.

రూరల్ టీడీపీ నేతలు..



విజయవాడ రూరల్ : ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణను విజయవాడ రూరల్ మండలం టీడీపీ నేతలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మచిలీపట్నంలోని ఆయన కార్యాలయంలో కలిసిన నేతలు నారాయణకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నారాయణను కలిసిన వారిలో మైలవరం మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ ఉయ్యూరు వెంకట నరసింహారావు, పార్టీ విజయవాడ రూరల్ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు గొడ్డళ్ల చినరామారావు, వేములకొండ నాగరాజు ఉన్నారు.

జనసేన నేతలు..



కంకిపాడు : ఆర్టీసీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కొనకళ్ల నారాయణను టీడీపీ, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు బోయిన నాగరాజు, సుంకర శివ, గుడివాడ మల్లిబాబు, పచ్చిపాల శేఖర్, ఓంకార్ పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలి

కంకిపాడు, సెప్టెంబరు 27 : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడు సీహెచ్‌సీకి హడ్కో సంస్థ ఇచ్చిన వాటర్ ప్యూరిఫైర్, వాటర్ కూలర్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. హడ్కో సంస్థ రీజియన్ చీఫ్ మూర్తిని ఆయన అభినందించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో హడ్కో సంస్థ జనరల్ మేనేజర్ కె. విజయకుమార్, సీనియర్ మేనేజర్ టి. సుబ్బా రావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంజయ్ మంత్ర, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, సుదిమళ్ల రవీంద్ర, యలమంచిలి కిషోర్‌బాబు, పులి శ్రీనివాసరావు, గోగినేని వెంకట రమణ, మద్దాలి సాయిబాబు, జనసేన పార్టీ నాయకులు ముప్పా రాజా, బోయిన నాగరాజు, పచ్చిపాల శేఖర్ పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ రూ. 6 లక్షల విరాళం



సీఎంకు చెక్కు అందజేస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

పెనమలూరు : కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల వాకర్స్ క్లబ్ సభ్యులు వరద బాధితుల సహాయార్థం గురువారం ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. ఆరు లక్షల చెక్కును అందించారు. ముఖ్యమంత్రి వారిని అభినందించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ యార్లగడ్డ రూప్‌కుమార్, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర, జీ వెంకటేశ్వరరావు, డాక్టర్ కేఎస్‌ఆర్కే ప్రసాద్ తదితరులు ఉన్నారు.

వృద్ధుల ఆర్థికసాయం

గోసాల (కంకిపాడు) : వరద బాధితుల సహాయార్థం వృద్ధులు ముందుకురావడం అభినందనీయమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. వరద బాధితుల సహాయార్థం గోసాల కోనేరు చారిటబుల్ ట్రస్టు వృద్ధులు రూ. 10 వేలు, కోనేరు కోటేశ్వరరావు రూ. 25 వేలు, భీమేశ్వరరావు రూ. 56 వేలు ఆర్థికసాయాన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కు శుక్రవారం అందజేశారు. అనుమోలు ప్రభాకర్, కోయా ఆనంద్ ప్రసాద్, మాబు సుబాని, యందువ రాంబాబు, సెంగెపు రంగారావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి గేట్లు బహూకరణ



హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 27 : దాతల సహకారంతో ఆలయాలను అభివృద్ధి చేయడంతో పాటు భక్తులకు సౌకర్యాలను కల్పించడం జరుగుతుందని ఈవో శ్రీనివాస్ అన్నారు. వీరవల్లిలోని సంతాన వేణుగోపాల స్వామి ఆలయ పునర్నిర్మాణం అనంతరం దేవస్థాన అభివృద్ధికి శుక్రవారం కొల్లి రామ్మోహనరావు దంపతులు గేట్లు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అమృతపల్లి సూర్యనారాయణ, లంక అజయ్, లంక రవిశ్రీనివాస్, శ్రీలక్ష్మి, నందమూరి సంధ్య, కోడెబోయిన బాబి, బోయపాటి మధుసూధనరావు, తదితరులు పాల్గొన్నారు.

- వీరవల్లి షిరిడిసాయి ఆలయంలో అర్చకుడు శ్రీనివాసరావు పర్యవేక్షణలో బాబా వారికి పంచామృతాభిషేకం, 108 లడ్డూలతో అష్టోత్తర శతనామావళి నిర్వహించారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు విద్యాబోధనపై శిక్షణ

ఉయ్యూరు, సెప్టెంబరు 27 : ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు భవిత కేంద్రాల్లో బోధించే సహిత విద్య ఉపాధ్యాయులకు ట్యాబ్‌ల వినియోగం, యాప్‌ల ద్వారా బోధనపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో సమగ్ర శిక్ష రాష్ట్ర ఐఈడీ కో-ఆర్డినేటర్ అన్నపూర్ణ మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ట్యాబ్, యాప్‌ద్వారా బోధించడం వలన వారిలో మానసిక అభివృద్ధి త్వరగా జరిగే అవకాశం ఉందన్నారు సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ రాములు నాయక్, స్టేట్ అసిస్టెంట్ ఐఈడీ కో-ఆర్డినేటర్ వనజ, జిల్లా ఐఈడీ కో-ఆర్డినేటర్ ఎస్.రాంబాబు, ఎంఈవో సుధారాణి, నరసింహ, సునీల్, మహాలక్ష్మీనాయుడు, వీరయ్యనాయక్ పాల్గొన్నారు.

గొడవర్రులో ఫ్లెక్సీ రగడ

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు పికెట్..



గొడవర్రు (కంకిపాడు), సెప్టెంబరు 27 : గొడవర్రులో ఫ్లెక్సీల రగడ రాజుకుంది. రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు.. గొడవర్రులో గౌడ బజారు వద్ద డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా జనసేన పార్టీ నాయకులు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. శుక్రవారం దేవర సినిమా విడుదల సందర్భంగా వైసీపీ నాయకులు ఫ్లెక్సీని అదే ప్రాంతంలో ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. అక్కడ ఉన్న పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీని తొలగించాలంటూ జనసేన పార్టీ నాయకులను కోరడంతో వారు ససేమీరా అన్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కంకిపాడు ఎస్సై సందీప్ సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలకు నచ్చ చెప్పి అక్కడ నుంచి పంపించి వేశారు.

సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 27 : దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, క్రమ శిక్షణతో కూడిన విద్య ద్వారా ఉన్నత స్థానాలకు ఎదగాలని లయన్స్ అధ్యక్షుడు కళ్లేపల్లి నారాయణరావు విద్యార్థులకు సూచించారు. వేలేరు అమ్మ అనాధ శరణాలయం (నేతాజీ సుభాస్‌చంద్రబోస్ అవాసీ విద్యాలయ) విద్యార్థులకు అవసరమైన స్టీలు ప్లేట్లు, గ్లాసులను అందజేశారు.

వరద బాధితులకు నిత్యావసరాలు



గన్నవరం, సెప్టెంబరు 27: బుడమేరు వరదల వల్ల ముంపునకు గురైన విజయవాడ, కైకలూరు ప్రాంతాలకు చెందిన బ్రాహ్మణులకు శ్రీవైఖానస యూత్‌ఫోరం ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. మండలంలోని దావాజీగూడెం సీతా రామచంద్ర స్వామి దేవస్థానంలో 120 బ్రాహ్మణ కుటుంబాలకు గన్న వరం శాఖ అధ్యక్షులు ఎన్.రామాచార్యులు నేతృత్వంలో నిత్యవసర సరుకులు, కూరగాయలు, వంట సామాగ్రి అందజేశారు.

క్రీడాస్ఫూర్తితో వ్యవహరించాలి



అండర్ 14 కబడ్డీ విజేత కంకిపాడు జడ్పీ జట్టు

నెప్పల్లి (కంకిపాడు), సెప్టెంబరు 27 : క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో వ్యవహరించాలని రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎస్.కె. మహబూబ్ అన్నారు. మండలంలోని నెప్పల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కబడ్డీ పోటీల ఎంపికలను ఆయన పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కంకిపాడు మండల క్రీడాధికారి ఎం. హరిగోపాల్, సబ్‌జోన్ అధ్యక్షులు భవాని, వై. మురళీ తదితరులు పాల్గొన్నారు. ● అండర్ 14 బాలికల జట్టు విజేత కోలవెన్ను జెడ్పీహెచ్‌ఎస్, రనర్స్ జెడ్పీహెచ్‌ఎస్ కంకిపాడు, అండర్ 14 బాలుర జట్టు విభాగంలో విజేతలుగా కంకిపాడు జెడ్పీహెచ్‌ఎస్, రన్నర్స్‌గా శ్రీ చైతన్య పునాదిపాడు. ● అండర్ 17 బాలికల జట్టు విజేతలుగా జెడ్పీహెచ్‌ఎస్ కంకిపాడు, రన్నర్స్‌గా జెడ్పీహెచ్‌ఎస్ కోలవెన్ను, అండర్ 17 బాలుర జట్టు విజేతలుగా శ్రీ చైతన్య పునాదిపాడు, రన్నర్స్‌గా జెడ్పీహెచ్‌ఎస్ పునాదిపాడు జట్టు నిలిచాయి.

బాలుర హైస్కూల్ హెచ్‌ఎం సస్పెన్షన్

గన్నవరం, సెప్టెంబరు 27 : స్థానిక బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నిమ్మగడ్డ రవీంద్ర భవానీని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల పాఠశాల ఆవరణలో ఉన్న బాలికల జూనియర్ కళాశాల విద్యార్థుల తల్లిదండ్రులకు, హెచ్‌ఎంకు మధ్య తగరతి గదుల మార్పు విషయమై ఘర్షణ జరిగింది. దీనిపై హెచ్‌ఎం ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా విద్యార్థినుల తల్లిదండ్రులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎం విద్యార్థినుల తల్లిదండ్రుల పట్ల దురుసుగా వ్యవహరించటంతో వాస్తవ పరిస్థితిని తెలుసుకున్న ఉన్నతాధికారులు హెచ్‌ఎంపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెండ్ చేశారు.

భగత్‌సింగ్ ఆశయాలు ఆదర్శనీయం



హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 27: దేశ పౌరుల్లో విప్లవస్ఫూర్తిని నింపిన అమరజీవి భగత్‌సింగ్ ఆశయాలు ఆదర్శనీయమని మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మానవత కార్యాలయంలో భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారగాని కొండలరావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, చెక్కా సుబ్బారావు, పీవీఎస్ చలం, రామచంద్రరావు పాల్గొన్నారు.